# మా మే న 'బా'వా'

-కాశ్వపల్లి ఉదయబాబు

''బావా!''

''ఊ!'' పుల్లప్స్ తీస్తున్న ప్రశాంత్ దగ్గరకు వచ్చింది విశాలి సోప్, టవల్‌తో!

''ఈ రోజు కూడా నువ్వు డ్యూటీకి వెళ్ళాలా!''

''ఏమైంది విశా!'' అతను ఒక్కక్షణం ఆగి ఆయాసపడుతూ అడిగాడు.

''ఏం లేదు బావా! ఈనెల అంతా సెలవుపెట్టకుండా స్కూల్లో వర్క్ చేసి చేసి బోర్ కొట్టింది. ఈ వేళ రాజమండ్రి ఏదైనా సినిమాకు వెళ్దాం అంటే సెలవు పెడతాను.''

అతను కొంచెం ఇబ్బందిగాను, కొంచెం కలవరపడినట్లు ఫీలయ్యాడు.

''సారీ విశా! నిన్ను బాధ పెట్టాలని కాదు. ఈవేళ అంటే ప్రతీ మొదటి శనివారం ఖచ్చితంగా నేను 'బాస్'తో ఉండి తీరాలి. అయినా నీకు ఏ రోజు ఎక్కడకి వెళ్ళాలనిపించినా ఒక రోజు ముందుగా చెప్పమని చెప్పాను కదా స్వీటీ!'' అన్నాడు తను లాలనగా!

ఆమె బుంగమూతి పెట్టింది.

''వారం రోజుల బట్టలు ఉతుక్కుని, ఇల్లు శుభ్రం చేసుకునే సరికే ఆదివారం ఒళ్ళుహూనం అయిపోతుంది. ఆపైన నువు ఖాళీగా ఉండనివ్వవు! ఇంకెప్పుడు నాకు విశ్రాంతి! ఏకంగా ఒక్కసారే! చచ్చాక!''

అతనామెను అపురూపంగా తనకు పొదువుకుని టక్కున ఆమె నోటిని మూసేశాడు! పెదవులతో కాదు చేత్తోనే!

''అందుకే విశా! నన్ను పెళ్ళి చేసుకోబోయే ముందు మనం ఒంటరిగా మాట్లాడుకున్నప్పుడు ఆలోచించి మరీ నీ అంగీకారం తెల్పమని నిన్ను అడిగాను గుర్తుందా. ఉద్యోగం లేని నాలాంటి మగవాడిని చేసుకోవడానికి ఎంతో మంది ఆడపిల్లలు నిరాకరించినా నాతో వివాహానికి నువ్వు అంగీకరించిన నాడు పది సంబంధాలు కాదని పదకొండో సంబంధం కుదిరిన 'ఆడపిల్ల'లా సంబరపడి నా అంత అదృష్టవంతుడు లేడనుకున్నాను. నీకు భర్తగా 'న్యాయం' చేసి ఇద్దరు మగ బిడ్డల నివ్వగలిగానేమో కానీ ఆర్థికంగా నీకు అయిదు పైసలు సాయం చేయలేకపోతున్నాను. భార్య సంపాదనతో బ్రతుకుతున్న చవట జల్సారాయుడు, పూలరంగడు... ఇలా బయట నేను వెళ్తోంటే ఎన్ని బిరుదులతో పిలుస్తారో తెలుసా. ఈ సమాజం ఏమనుకున్నా నాకనవసరం. నా జీవితానికి నువ్వు ఓ ఆలంబన. ఓ ఆలాపన. కొన్ని సందర్భాలలో నువ్వు ఇలా బాధపడతావని కూడా తెలిసీ ఏం చేయలేని అశక్తుడిని. నన్ను క్షమించు.''

సరదాగా మొదలుపెట్టి సీరియస్‌గా అతని మాటలు పూర్తయ్యే సరికి ఆమె 'చిమిడిన అన్నం'లా మెత్తబడిపోయింది.

''అదిగో! మగాడు అలా మాట్లాడితేనే నాకు నచ్చేది. మగాడు 'నిజమైన' మగాడులా ఉండాలి. మిమ్మల్ని చూసి నాకు అందుకే గర్వం. అయినా నేను ఒక్క మాట అడిగితే వంద మాటలు మాట్లాడి నా నోరు టక్కున మూయించే నీ తార్కిక విద్యకి జోహార్లు బావా! అందుకే నీతో ఏం మాట్లాడాలన్నా నీ సమక్షంలో మూగదానినై పోతాను'' ఆమె కళ్ళు ఆర్ద్రంగా చమర్చాయి.

''ఛ! నేనేదో సరదాగా అంటే అలా ఫీలయితే ఎలా విశా! అయినా నీకు ఎన్ని ''రకాలు''గా ''భయం'' పోగొట్టినా ఇంకా నేనంటే భయపడుతూనే ఉన్నావన్న మాట.''

అతని మాటలలోని 'చిలిపి భావం' అర్థమైన ఆమె రోమాంచితమైన చిరు చెమటలు పట్టిన అతని వక్షాన్ని ఆప్యాయంగా చూపుడు వేలుతో వ్రాస్తూ అంది.

''ఊ! ఈ విద్యలు బాగా వచ్చు అబ్బాయి గారికి. సర్లే! నీకు ఖాళీ అయినప్పుడు నువ్వే నన్ను బయటకు తీసుకు వెళ్తావని నాకు తెలుసు కానీ నన్ను వదులుతావా! స్నానం చేసి స్కూలుకెళ్ళాలి!''

''ఒక్కటిస్తే వదులుతాను'' అతని కళ్ళల్లో చురుకైన మెరుపు.

''నే కాదన్నానా!'' అతని బుగ్గ గట్టిగా కొరికి అతనా 'తీయని' బాధలో వదలగానే ఆమె తుర్రుమని పారిపోయింది.

''నీకూ తెలివి తేటలు బాగానే వచ్చాయే!'' అతను బుగ్గ తడుముకుంటూ అన్న మాటలకు బాత్రూమ్‌లోంచే సమాధానం వచ్చింది -


''నీవు నేర్పిన విద్యయే మహానుభావా!''

అతను ఎక్సర్‌సైజులు ఆపి వంట గదిలోకి నడిచాడు.

***

వాళ్ళిద్దరూ నిజంగా బావా మరదళ్ళు కారు.

ఇరవై ఎనిమిదేళ్ళ విశాలికి తనకు ఈ జన్మలో వివాహయోగం ఉందని వూహించలేదు. చామనఛాయ మీద ఒక రంగు తక్కువే అయిన ఆమె ఎలిమెంటరీ స్కూలు టీచరుగా చేస్తున్నా ''అందాని''కి ప్రాధాన్యత ఇచ్చే సంబంధాలే ఆమెకు రావడమే దానికి కారణం. అయితే తన స్నేహితురాలు వివాహానికి విజయవాడ వెళ్ళిన విశాలను,



(గ్రాఫిక్స్: భాస్కర్)

పెళ్ళికూతురు అన్నయ్య స్నేహితుడైన ప్రశాంత్ ఆమెలోని అద్భుతమైన 'లక్ష్మీ కళ' ని చూసి మొదటి చూపులోనే ఇష్టపడడంతో ఉద్యోగమే లేని అతనిని, అప్పటి వరకూ తన కుటుంబ బాధ్యతలతో అలసిసొలసిన విశాలి వెంటనే తన అంగీకారం తెలపడం జరిగింది.

అయితే పెనంమీద నుంచి పొయిలో పడ్డట్టయ్యింది ఆమె పని. ప్రశాంత్ తనతో ఏకాంతంగా మాట్లాడినప్పుడు 'ఆ' విషయాలకు ఆమె బాధపడలేదు. అవేమిటంటే తనలాంటి తన ఆడపడుచులకు ఇద్దరికి వివాహం చేసే బాధ్యత, పాలిటెక్నిక్ చదువుతున్న 'మరిది'కి నెలనెలా కొంత డబ్బు పంపడం. వివాహం అయ్యాక వాళ్ళు తన వాళ్ళు అన్న భావం ఆమె వ్యక్తం చేసేసరికి ప్రశాంత్ ఆమెకు ప్రమాణం చేశాడు. ''ఎట్టి పరిస్థితులలోనూ ఆమె మనసుకు కొంచెం కూడా వ్యధ కలిగించేలా ప్రవర్తించదు'' అని.

ఆమె చేత కూడా అతను ప్రమాణం చేయించుకున్నాడు. తనను ''బావా'' అని పిలవాలని. అలా అయితే భార్యాభర్తల మధ్య అంతరాలు ఉండవని, ఆంతర్యాలు తెలుసుకుని మసలడం వల్ల మరింత అన్యోన్యంగా జీవితం గడపవచ్చని అతని ఉద్దేశం!

తను సంపాదించి నెల జీతం అతని చేతుల్లో పోస్తే చాలు. ఒక వసంత రుతువు అందించే మానసిక ఆనందాన్ని, ప్రశాంతతని తనకు మిగిల్చే భర్త లభించినందులకు తన జీవితానికి సార్థకత భర్త రూపంలోనూ, ఇద్దరు మగబిడ్డల తల్లిగానూ విశాలికి ఎంతో గర్వంగా అనిపించేది.

లోన్లు పెట్టి ఏడాది తేడాతో ఇద్దరు ఆడపడుచుల వివాహాలు చేయడంతోను, మరిది పాలిటెక్నిక్ పూర్తి చేసి ఒక కంపెనీలో సూపర్‌వైజర్‌గా ఎప్రంటిస్‌లో చేస్తూ తన వదిన 'రుణం' తీర్చుకునే ప్రయత్నం చేస్తూండడంలోనూ అయిదేళ్ళ వివాహ జీవితం సినిమా రీలుగా తిరిగిపోయినట్టే అనిపించదు విశాలికి.

## ఊర్మిళ భాష

ఆమధ్య దక్షిణాఫ్రికాకు వెళ్ళి వచ్చినప్పటి నుండి ఊర్మిళ మాట్లాడే భాష ఏమిటో అర్థమవ్వక బాలీవుడ్ జనాలు తల పట్టుకుంటున్నారు. 'జంగిల్' చిత్రం షూటింగ్‌లో పాల్గొన్న వాళ్లందరినీ తన స్వంత బాణీలో మాట్లాడుతూ బోల్తా కొట్టించింది. కొద్ది రోజులు 'కొంకణీ'లో మాట్లాడినట్లు ఫోజులు కొట్టిన ఊర్మిళ ఆ భాష తెలిసిన వ్యక్తి తారసపడటంతో ఇరుకునపడింది. ఇప్పుడు తాజాగా స్పీడుగా కొన్ని పదాలని వాడుతూ ఎదుటివారిని బురిడీ కొట్టిస్తోంది. ''ఎవరూ మాట్లాడకపోతే కొత్త మాటలెలా పుడతాయి?'' అని ఊరికే అన్నారా? ఎవరి పిచ్చి వారికి...



పగలల్లా ఉద్యోగం చేసి అలసిసొలసి వచ్చిన భర్తకి భార్య ఏ విధంగా ప్రవర్తిస్తే అతని మనసంతా భార్యపట్ల అనురాగం పొంగి పొర్లుతుందో, ఆమె ఇంటికి చేరే సరికి అతడు అలా ప్రవర్తించేవాడు. అతని సహాయ సహకారాలు భార్యపట్ల అంతగా ఉండేవి.

పిల్లలు పుట్టి ఖర్చులు పెరగడం మొదలయ్యాక అతను తనలో తాను తర్కించుకున్నట్టుగా ఎన్నోసార్లు ఆలోచనలలో పడిపోయేవాడు. అంత వరకూ 'జీవితం' అంటే 'ఎంజాయ్‌మెంట్' అన్న భావన గల ప్రశాంత్ పొదుపు పాటించడం, అది పిసినారితనంగా మారి అత్యవసరం అయితేనే తప్ప ఖర్చుపెట్టని స్థితికి చేరి, భార్య సంపాదన ఒక్కటే జీవితావసరాలకు చాలకపోవడంతో మగవాడికి ''తనదంటూ ఒక సంపాదన అవసరం'' అన్న నగ్న సత్యాన్ని గుర్తించాడు. అందుకోసం అతడు చేసిన ప్రయత్నం ఫలించింది. ఏ పెళ్ళిలో తను విశాలిని చూశాడో విశాల ఆ స్నేహితురాలి వల్లనే! దాంతో పిల్లలిద్దరినీ వాళ్ళ అమ్మమ్మ గారింట్లో వదిలేయక తప్పలేదు. ప్రతీ పదిహేను రోజులకోసారి వెళ్ళి అతనో, విశాలో వీలయితే ఇద్దరూ వెళ్ళి చూసి వస్తుంటారు.

తన కష్టార్జితం కరిగించి తన భార్యకు తన ప్రేమను అరుదైన రీతిలో తెలియజేయాలనుకునే అతని తపనని అర్థం చేసుకున్న ఆమె అందుకే అతనికి ఎక్కువగా విసిగించదు.

విజయవాడలో ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో సూపర్‌వైజర్‌గా ప్రస్తుతం జాబ్ చేస్తున్న ప్రశాంత్ ప్రతీ ఉదయం పదకొండు గంటల పాసింజర్‌కు విజయవాడ వెళ్ళి రాత్రి ఎనిమిది గంటలకల్లా బయల్దేరి ఇంటికి వస్తాడు. అయితే అతని జీతం ఎంత? అని అతనిని ఏనాడూ ప్రశ్నించని విశాలి ఆ రోజు పోస్టులో అతనికి వచ్చిన ఉత్తరం చదివి స్థాణువై పోయింది.

స్కూలు వెళ్ళిన ఆమెకి తలనొప్పి తీవ్రమవడంతో అతను వెళ్ళిపోయాక ఇంటికి చేరిన ఆ ఉత్తరం అందటం. అదీ ఒక స్త్రీ నుంచి - అందునా తనకు తెలియని స్త్రీ దగ్గర నుంచి.

''మిస్టర్ ప్రశాంత్,

మీరు నన్ను కలిసి మూడు నెలలు అవుతోంది. ప్రతీసారి ఒంటరిగా వెళ్ళే మా వారు ఈసారి నన్ను కూడా తనతో బెంగుళూరులో మా హోటల్ కన్‌స్ట్రక్షన్ నిమిత్తం తీసుకెళ్ళిపోయారు. మన అగ్రిమెంట్ ప్రకారం నెలలో మొదటి శనివారం మీరు నన్ను కలవాలి. ఒక ఆడదానికి 'జీవితానుభవం' రుచి చూపించి దూరమైపోతే ఏమిటి అర్థం? నా అవసరం మీకు తీరిపోయిందనా? మా వారు మళ్ళీ రెండు రోజుల్లో బెంగుళూరు వెళ్తున్నారు. ఈ శనివారం మీ కోసం ఎదురు చూస్తుంటాను. ఇంటికి ఉత్తరం వ్రాయడం మీకు ఇష్టం ఉండదని తెలుసు. కానీ ఈసారి నేను నిగ్రహించుకోలేక పోతున్నాను. మీ అప్లికేషన్ బయోడేటాలో మీ అడ్రస్ తీసుకుని ఈ లెటర్ వ్రాస్తున్నాను. ఈ లెటర్ మీ శ్రీమతి చేతుల్లో పడకూడదనే కోరుకుంటున్నాను.

విత్ లవ్ -

అభిలాష''

నాలుగు రోజుల క్రితం డేట్ వేసుంది దానిమీద. పోస్టల్ డిలే కాబోలు!

విశాలికి కళ్ళ ముందు అంతా చీకటిగా అనిపించింది.

తనకి తెలియకుండా ప్రశాంత్‌కి ఇంకో స్త్రీతో సంబంధమా! డైరెక్ట్‌గా బావనే అడిగేస్తే సరి. ఆలోచించడం వలన వచ్చే తలనొప్పి కన్నా సమస్యను ముఖాముఖి పరిష్కరించుకోవడం ఉత్తమం.

ఆమె ఆ ఉత్తరాన్ని ప్రశాంత్ లోపలికి వస్తే కనిపించేలా ఎదురుగా అతని టేబుల్‌పై పెట్టి టాబ్లెట్ వేసుకుని పడుకుంది.

అంత కంటే విచిత్రంగా ప్రశాంత్ ఆ సాయంత్రం ఆరు గంటలకే ఇంటికి వచ్చేశాడు. విశాలిని ఆశ్చర్యంలో ముంచెత్తాలని అతని ఉద్దేశం. అతను ఇంటికి వచ్చేసరికి విశాలి ఇంట్లో ఉండటం,

హైగా అదోలా ఉండటం గమనించాడు ప్రశాంత్.

ఎదురుగా అతనికి తన టేబుల్‌పై ఉత్తరం కనిపించింది. అర్థ మైంది అతనికి. ఏ భావం లేకుండా డ్రస్ మార్చుకుని టీ పెట్టాడు.

అయితే విశాలికి 'విషయం' తెలిసిపోయిందన్నమాట.

''విశా ... విశా! లే .. లే... లేచి టీ త్రాగు'' ఏమీ ఎరుగనట్లు మాట్లాడుతున్న అతనిని ఆమె కూడా ఏ భావం లేకుండానే అదోలా చూసి టీ త్రాగి మళ్ళీ పడుకుంది.

ఆ పూట తనే వంట చేశాడు.

ఇల్లు అద్దంలా తీర్చిదిద్దాడు.

ఎనిమిది గంటలకు విశాలిని బలవంతంగా లేపి వేడినీళ్ళు స్నానానికి పంపాడు ప్రశాంత్!

అందమైన బోర్డర్ ఉన్న వైట్ కాటన్ శారీ, మేచింగ్ జాకెట్‌తో విరిసిన వెన్నెలలో పుచ్చపువ్వు మెరుస్తున్నట్టుగా నీరసమైన చూపుతో ... ఆమె పొడవైన జడలో తను తెచ్చిన రెండు మూరల విరిసిన విర జాజులు నాలుగు మడతలుగా చేసి అలంకరించాడు.

మంచం మీద కూర్చున్న ఆమె దగ్గరకు ఒక చేతిలో ఉత్తరం, మరొక చేత్తో ఒక బేగ్ పట్టుకుని తనూ ఆమె ముందు మంచంమీద బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు.

''విశా! నువు ఈ ఉత్తరం గురించి అడుగుదామనుకుంటున్నావు. నేను నీకో సంతోషకరమైన వార్త చెబుదామనుకుంటున్నాను. ఏది ముందు?'' అడిగాడతను.

ఆమె తలవంచుకుని చేతితో చీర అంచుల మడతలు సర్దుకోసాగింది -

''విశా! ప్లీజ్! మాట్లాడు!''

ఆమె చుబుకం పట్టి పైకెత్తిన ఆమె కళ్ళనిండా నీళ్ళు జలజలా ఆమె బుగ్గల వెంట కారిపోవడం అతన్ని బాగా కలవరపరిచింది.

''విశా!'' అతను ఒక్కసారిగా ఆమెను తన ఒడిలోకి లాక్కున్నాడు.

''వద్దు విశా! నువ్వు కన్నీరు కార్చడం నాకు ఇష్టం ఉండదు. అది మగాడికి శుభం కూడా కాదని నీకు తెలుసు. నీ కంటి నీరు నేను భరించలేను విశా!''

అతను ఆమెను గాఢంగా గుండెలకు హత్తుకుని అందిన చోటల్లా చుంబించాడు. తమకంగా! ఆమె లతలా అతనిని అల్లుకుపోయి అశక్తురాలిలా ఉండిపోయింది. అతను ఆమెను తన గుండెల మీద పడుకోబెట్టుకుని ఆమె వీపు ఆప్యాయంగా నిమురుతూ ఉండిపోయాడు.

ఆమె తేరుకుంది మరో రెండు నిమిషాలలో!

''చెప్పు బావా! ఏదో సంతోషకర వార్త చెబుతానన్నావ్!''

''ఏం చెప్పమంటావ్ విశా! మనసును మభ్యపెట్టుకోవడం అంటే మనని మనమే హత్య చేసుకోవడం. నిన్ను మభ్యపెట్టడం కోసం అబద్ధాలు కల్పించి చెప్పడం నాకు ఇష్టం లేదు. ఎటొచ్చీ ఈ ఉత్తరం నీలో అనుమాన బీజం వేసింది అనడంలో అతిశయోక్తి లేదు! కదూ!''

ఆమె నీరసంగా నవ్వింది.

''ఎంతయినా ఆడదాన్ని కదా బావా!''

''ఓకే విశా! నీకు రెండు నిజాలు చెబుతున్నాను. విను. మన వివాహానికి ముందు నేను జీవితం అంటే ఆడదాని లాంటి విలాస వస్తువుతో ఎంజాయ్ చేయడం అనుకునే వాడిని. నీ సాన్నిధ్యంలో మొలకెత్తిన నాకు నా బాధ్యతలలో పాలుపంచుకుని నిస్వార్థమైన భార్యగా నాకు మళ్ళీ జన్మనిచ్చావు. నీ కష్టార్జితంతో కండలు పెంచుకున్న నేను నిజాయితీ నిండిన నీ ప్రేమ ముందు ఓడిపోయాను. నా శరీరంలో ప్రతీ రక్తపు బొట్టు నీది. నా శరీరానికి నువ్వు పెట్టుబడి పెట్టిన ప్రతీ పైసా నీకే చెందాలి. అందుకే నా ''కష్టార్జితం''తో నీ మనసుకు నచ్చే పని చేద్దామని నీ కోసం నా కిష్టమైన బహుమతిని పట్టుకొచ్చాను. అందుకు ఈ బేగ్ ముందు తెరవనా! ఈ ఉత్తరం ముడివిప్పనా!''

అతని కళ్ళు స్వచ్ఛమై విరిసిన మల్లెల్లా తెల్లగా నవ్వుతున్నాయి.

ఆమె మౌనంగా బేగ్ తీసుకుని జిప్ తెరచింది.

కళ్ళు జిగేల్‌మనేలా, మనసు ఝల్లుమనేలా నిలువెల్లా పులకించింది ఆమె. అది అతని పట్ల ఆమె ప్రకంపన.

అతను బాగ్‌నుండి అత్యంత అద్భుత పనితనంతో మెరిసిపోతున్న నాలుగు జతల బంగారు గాజులు, ఒక నెక్లెస్ తీసి ఆమె చేతుల కిచ్చాడు.

వాటిని కళ్ళ కద్దుకుని అనుమానంగా మళ్ళీ మంచం మీదే ఉంచబోయింది. అతను తల అడ్డంగా వూపి వాటిని అందుకుని ఆమెకు అలంకరించాడు. ఎప్పుడు నిరాడంబరంగా ఉన్న ఆమె ఒక్కసారిగా నిండైన 'తెలుగుతల్లి'లా నిండుశోభతో మెరుస్తూ కనిపించింది అతని కళ్ళకు.

అతను ఆమెను డ్రస్సింగ్ టేబుల్ వద్దకు తీసుకు వచ్చి నిలబెట్టాడు. ఆమె తనని తాను ఒక క్షణం తదేకంగా చూసుకుని అతని గుండెలపై వాలిపోయింది.

## ముంబాయే పదిలం!

అంటున్నాడు హృతిక్ రోషన్. క్షణం తీరిక లేని హృతిక్, కాస్త రెస్టు తీసుకొని తండ్రి తోడు రాగా లండన్ వెళ్ళాడు. అక్కడ అభిమానుల తాకిడి ఎక్కువ అవడంతో భరించలేక లండన్ కన్నా ముంబాయే పదిలమంటూ వెనక్కి వచ్చేశాడు. అన్నట్టు తన అభిమానైన ఓ కేన్సర్ రోగి తనను చూడాలనుకుంటున్నాడని అక్కడి డాక్టర్లు చెప్పగానే తీరిక చేసుకుని పరామర్శించి వచ్చాడట.!



''విశా! నేను 'పదమూడు నెలలు'గా సంపాదించిన కష్టార్జితంతో నీకు సమర్పించాలనుకున్న కానుక. అయితే నువ్వు నన్ను ఒక్క విషయంలో క్షమించాలి!'' మంద్రంగా తప్పు చేసిన వాడిలా తల వరిచుతూ అన్నాడతను.

''ఉత్తరం విషయంలోనేనా!''

''అవును విశా! నేను ఒక తప్పు చేశాను. ఉద్యోగాలకు డబ్బును లంచం అడిగే అధికార్లను ఎందరినో నువ్వు చూసి ఉంటావు. కాని ఆవిడ! అదే మా బాస్ నా 'మగతనాన్ని' లంచంగా కోరింది! అలా అయితేనే జాబ్ ఇస్తానంది. నాకు తప్పనిపించలేదు.''

''ఏం? ఎందుకని?'' ఆమె సూటి ప్రశ్నకు అతను ఒక్క క్షణం తడబడ్డాడు.

''నేను ఉద్యోగ ప్రయత్నం చేయనంత వరకూ నా పాత జీవిత ప్రభావం నాపైన ఉంది కాబట్టి. కానీ ఆమెతో నేను ఉన్నంతసేపు నా తలపుల నిండా నువ్వే! మీరు చేస్తున్నది తప్పు అని నన్ను శాసిస్తున్నట్టు! నా వల్ల ఆమె ఏం పొందిందో నాకు తెలీదుగానీ నాకు ఉద్యోగం ఇచ్చింది.

మా ఒప్పందం ప్రకారం నెలలో మొదటి శనివారం నేను పూర్తిగా ఆమెతో గడపాలి. అలా అని సంవత్సరానికి అగ్రిమెంటు వ్రాసి సంతకం పెట్టించుకుంది. అయితే మీరెందుకు అంగీకరించారు అని నీకు డౌటు రావచ్చు. నీకు ముందే చెప్పాను. నిస్వార్థమైన నీ ప్రేమ, త్యాగపూరితమైన నీ అనురాగం ముందు నేను గడ్డిపోచకన్నా హీనమని గుర్తించి వాటి ముందు ఓడిపోయాను. ఉద్యోగం లేని మగవాడు ఆడదాని జీతంతో బ్రతికే వాడూ జీవచ్ఛవంతో సమానం అనిపించింది. ''నాతి చరామి'' అని నేను నీ చేతిలో చేయివేసి పెద్దల ముందు చేసిన ప్రమాణానికి అర్థం లేదనిపించింది. నాకు ఏ శిక్ష విధించినా భరించడానికి సిద్ధంగా ఉన్నాను విశా! నన్ను ... నన్ను క్షమించు!'' అతను గాద్గదికంగా చివరి మాటలు అని ఆమె ముందు చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

''నేను కంటతడిపెడితే చూడలేని నీ కళ్ళల్లో నీళ్ళా! ఏంటి బావా ఇది! ఇందులో నీ తప్పు నాకు కనిపించలేదు. అవసరం కోసం నువ్వు తాపత్రయపడ్డావు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది ఆమె. ఏది ఏమైనా ''దొంగతనం, కార్లెక్టర్ కోల్పోవడం' ఈ రెంటి వల్లే మనిషి బ్రతుకగలడు అనుకుంటే చాలా తప్పు బావా! అలాంటి తప్పు నువ్వు మరెప్పుడూ చెయ్యొద్దు బావా! నువ్వు ఆరోగ్యంగా ఉంటేనే నా సౌభాగ్యం. 'అడ్డమైన' వాళ్ళతో తిరిగి రోగాలు కొని తెచ్చుకునే కంటే అసలు అడుసులో కాలు వేయకుండా చూసుకుంటే బాగుంటుందన్నదే నా సలహా! అయితే నిన్ను క్షమించే ముందు నాకు నువ్వో మాట ఇవ్వాలి!'' అందామె.

ఏమిటన్నట్టు చూశాడతను.

అతని చెయి తన తలమీద పెట్టుకుని పట్టుకుని అతని వైపు సూటిగా చూస్తూ అడిగింది విశాల.

''ఈ నగలు నేను తీసి విసిరేస్తే నువ్వు ఎలా ఫీలవుతావు?''

''విశా!'' ఎర్రగా కాలిన ఇనుము మీద పడ్డ సుత్తి దెబ్బ తగిలిన వాడిలా ఫీలయ్యాడతను.

''ఇందులో నా తప్పు కూడా కొంత ఉంది బావా! భార్యగా మీ అవసరాలు తీరుస్తున్నాననుకున్నానే గానీ ఉద్యోగం విషయంలో నువ్వు ఇంత బాధపడుతున్నావని నేను గ్రహించలేకపోయాను. నీ ఒడిలో సేదతీరుతున్నానని నా స్వార్థంతో ఆలోచించానే గానీ నీ మానసిక క్షోభను అర్థం చేసుకోలేకపోయాను. చూశావా! నా ఒక్క మాటకి నిన్ను అగాధంలోకి తోసినట్టు ఫీలయ్యావే! నీ ఒక్క పని చాలు బావా ఏ ఆడదాని మనసైనా విరిగిపోవడానికి. అందుచేత నువ్వు రేపే నీ ఉద్యోగానికి రాజీనామా చేసిరా! నీకు మనశ్శాంతే కాదు పది మందికి మార్గదర్శిగా మిగిలే బాధ్యత నీకప్పగిస్తాను. అప్పుడు బహుశా నన్ను కూడా మర్చిపోతావేమో! సరేనా?''

అతడు భార్యలో 'కరణేషు మంత్రి'ని చూస్తున్నాడు.

''అయితే నన్ను క్షమించినట్లేనా?'' అతడు తేలికపడ్డ మనసుతో అడిగాడు.

''నిజంగా నువ్వు తప్పు చేస్తే కదా క్షమించడానికి. ఉద్దేశపూర్వకంగా తప్పు చేయదలచుకుంటే నువ్వు 'ఆమె'కి నువ్వు 'వివాహితుడివి' అన్న నిజాన్నే చెప్పే వాడివి కాదు. ఒక తప్పు చేసి ఆ తప్పు ఎందువల్ల చెయ్యవలసి వచ్చిందో విశ్లేషించుకుని తన పరిస్థితుల్ని దానికి అన్వయించకుని సమర్థించుకునే వాళ్ళు ఆ తప్పులతోనే తమ జీవితకాలం గడిపేస్తారు. నువ్వు చేసింది తప్పే అయినా నిజాయితీతో చేసిన తప్పు అది. అందుచేత ఇంక పిచ్చి ఆలోచనలతో మనసు పాడు చేసుకుని ఆ తప్పు చెయ్యొద్దు బావా! చేయనివ్వను నిన్ను! రేపు సండే అయినా వెళ్ళి మీ జాబ్‌కి గుడ్‌బై కొట్టేసి రండి! మీరు ఏనాడు తల వంచకుండా బ్రతికేలా నేను చేస్తాను.''

'తెల్లవారేంతవరకూ ఉండాలా! ఇప్పుడే వెళ్ళొచ్చేస్తాను విశా!'

''మిమ్మల్ని చేయవద్దన్నది బయట తప్పుల్ని! నువ్వు నా పట్ల చేసే 'తప్పుల' వల్లే ఇంత హాయిగా జీవించగలుగుతున్నాను. అయినా 'తప్పు' చేయవద్దన్నది నిన్నొక్కడిని. మనం 'తప్పు' చేయకపోతే జీవితానికి అర్థమే లేదు. తెల్లవారేంత వరకూ నేను లేనూ? కలిసి 'తప్పు' చేస్తే నేరం అవతల వాళ్ళ మీదకు తోసేసి ఇవతలి వాళ్ళు హాయిగా బ్రతికేయవచ్చు!''

ఆమె కలువ హృదయం అర్థమైన అతడు ''సమయాన్ని వృధా చేయడం మరో తప్పేమో!'' అంటూ ఏమో అనబోయి ఫక్కున నవ్విన ఆమెను అమాంతం రెండు చేతుల్లోకి ఎత్తుకుని గిరగిరా తిప్పేసి ఆమెను డబుల్‌కాట్ మీద అపురూపంగా దించాడు. 'తప్పు' చేసే అవకాశం ఇచ్చిన ఆమె తేలికపడిన మనసుతో అతనిలో ఒదిగిపోయింది. ఆపైన మాటలే కరువైన వారి ప్రేమానురాగాల సంగమంలో ఆమె నగలు 'గలగల'లతో పాటు మరింత 'ధగధగ'లను సంతరించుకున్నాయి.

***

మరునాడు సాయంత్రం ప్రశాంత్ సంతోషాతిరేకంతో రిషా ఇంటి ముందు దిగేసరికి పచ్చని తోరణాలతో, బంతీ చామంతులతో అందంగా అలంకరించబడి ఠీవిగా తను గుమ్మం ముందు నిలబడిన పెద్ద ''స్వాగతం'' బోర్డు ఆహ్వానం పలికింది.

''ప్రశాంత్ మహా విద్యాలయం - ఇచట 6 నుండి 10వ తరగతి వరకు అన్ని తరగతుల విద్యార్థులకు ట్యూషన్స్ చెప్పబడును - ఫీజు మీ ఇష్టం.''